# ప్రకృతి ప్రేమికుడు

- 56 వేల మొక్కలు నాటిన యోగనాథన్
- ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం
- పండ్ల చెట్లకు పిల్లల పేర్లు



**దృశ్యం 1:**

మంచుతెరలు మెల్లగా వంగి కొండ-శిఖరం చెవిలో గుసగుసలాడుతున్న అందాల దృశ్యాన్ని చూస్తూ... ప్రకృతి సోయగానికి పరవశిస్తున్నాడా పదేళ్ల కుర్రాడు. అంతలో పెద్ద చప్పుడు. ఓ పెద్ద వృక్షాన్ని వేర్లతో సహా నరికేస్తున్నారెవరో. దాన్ని అడ్డుకునే శక్తిలేదతనికి. లోలోపల కుమిలి పోయాడు. అయితే... ఆ సంఘటన అతని మదిలో బలంగా నాటుకుంది.

**దృశ్యం 2:**

అదో పాఠశాల తరగతి గది. చిన్నారులకు పచ్చదనంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాడతను. 'దాహంతో మీ నాలుక పిడచకట్టుకుపోతే గొంతు తడిపేందుకు అమ్మ ఉంది. మరి మీ తల్లులు... మనందరి మాతృమూర్తుల దాహం తీర్చేదెవరు? భూమే కదా. ధరణిని కూడా మనం అంతే ప్రేమగా చూసుకోవద్దూ...' అని వివరిస్తున్నాడతను.



ఉపరాష్ట్రపతి హామీద్ అన్సారీ చేతులమీదుగా అవార్డు అందుకుంటూ..

ఈ రెండు దృశ్యాల్లోనూ ఉన్న వ్యక్తి ఒక్కరే. కానీ రెండింటి మధ్య 26 ఏళ్ల అంతరం ఉంది. ఇప్పుడతను జగమెరిగిన ప్రకృతి ప్రేమికుడు. పేరు... యోగనాథన్. ఇటీవల ఎర్త్ మేటర్స్ ఫౌండేషన్ అనే సంస్థ ఆయనకు 'ఎకో వారియర్' (పర్యావరణ యోధుడు) పురస్కారం అందించింది. ఉప రాష్ట్రపతి హామీద్ అన్సారీ చేతులమీదుగా దానిని స్వీకరించారు. దక్షిణ భారతదేశంలో ఈ పురస్కారం అందుకున్న ఏకైక ప్రకృతి ప్రియుడు ఈయనే. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనమిది...

## పిల్లల్లో ఆత్మీయభావన...

చిరుప్రాయంలోనే చిన్నారుల్లో ప్రకృతిపై ప్రేమ బీజాలు నాటితే అద్భుత ఫలితాలు ఇస్తాయన్నది యోగనాథన్ నమ్మకం. అందుకు తనదైన పద్ధతి అవలంబిస్తున్నారు. పిల్లల చేత నాటించే పండ్లచెట్లకు వారి పేర్లు పెడతారు. అంటే... ప్రియ మామిడి, షణ్ముఖం జామ, పద్మ నేరేడు... ఇలాగా. దీంతో ఆ చెట్టు తమదేనన్న భావంతో పిల్లలు ఆత్మీయభావం పెంచుకుంటారన్నది ఆయన భావన. అదిప్పుడు సత్ఫలితాలిస్తోంది కూడా. రాష్ట్రంలోని పలు సంస్థలు ఆయనకు 'గ్రీన్ మ్యాన్', 'ప్రతిష్ఠాత్మక పచ్చమై నేచర్' అవార్డులూ అందించాయి.

## పచ్చదనంతో రైట్... రైట్

యోగనాథన్ వృత్తిరీత్యా ప్రభుత్వ బస్సు కండక్టర్. ప్రవృత్తి ప్రకృతి ఆరాధన. గత 26 ఏళ్లలో ఆయన 56 వేల మొక్కలు నాటారు. వీటిలో 38 వేల మొక్కలు మహా వృక్షాలయ్యాయి. మొక్కలు నాటడంపై పలు రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మొదట్లో యోగనాథన్ తన సొంత ఖర్చుతోనే మొక్కలు కొని నాటుతుండేవారు. ప్రస్తుతం సామాజిక సేవా సంస్థలు, స్థానిక నర్సరీలు వాటిని ఉచితంగా అందిస్తున్నాయి.

-చెన్నై, న్యూస్‌టుడే

## ఎవరు ఓదారుస్తారు?

కోవైలో ఆ మధ్య రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. పలుచెట్లు జాలిగా నేలకూలాయి. వాటికి అంజలి ఘటించేందుకు అదేరోజు పుష్పగుచ్ఛం తీసుకెళ్లాను. ఇంతలో ఏదో శబ్దం. తిరిగి చూశాను. ఓ చెట్టు కిందపడడంతో గూడు చెదిరి పక్షిపిల్లలు చనిపోయి ఉన్నాయి. ఆ విషయం తెలియక తల్లిపక్షి నోటిలో ఆహారం పెట్టుకుని పిల్లల కోసం అరుస్తూ కనిపించింది. నాకు కన్నీరు ఆగలేదు. దాన్నెవరు ఓదారుస్తారు? మనుషులు చేసే పనులన్నీ ఇలాగే ఉంటాయి. తమ స్వార్థం కోసమే చూస్తారు. మిగిలిన జీవుల గురించి పట్టించుకోరు.

- 'న్యూస్‌టుడే'తో యోగనాథన్.

